క్లుప్తంగా

ఎస్ఐ భాస్కరరావు బాధ్యతల స్వీకరణ



పెందుర్తి: పెందుర్తి లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ)గా నూక వెంకట భాస్కరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ద్వారకా పోలీస్ స్టేషన్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ సారథ్యంలో పెందుర్తి ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎస్ఐ పేర్కొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం



పీఏసీఎస్ ఆవరణలో మొక్కలు నాటుతున్న పర్సన్ ఇన్‌చార్జి శాస్త్రి, తదితరులు

సబ్బవరం: స్థానిక మండల కేంద్రంలోని శ్రీదుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి(పీఏసీఎస్)లో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఆవరణలో మొక్కలునాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ పీవీఎస్ శాస్త్రి చేతులమీదుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంఘం సీఈవో గొంప రమణతో పాటు మిగిలిన సిబ్బంది జి.దేముడు, రామకృష్ణ, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి నిధులు



అంగన్‌వాడీ సెంటర్ వద్ద తుప్పల తొలగింపు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు గొల్లపేటలో అసంపూర్తిగా నిలిచిన అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయడానికి మండల పరిషత్, ఎన్టీపీసీ నుంచి రూ.6 లక్షలు మంజూరైనట్లు నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య తెలిపారు. ఐదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిన ఈ భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలు మంజూరు కాగా, మిగిలిన రూ.4 లక్షలు ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ సెంటర్ వద్ద బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. మండల పంచాయతీ విస్తరణాధికారి వి.ధర్మారావు, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి, సారిపల్లి నేస్తాలు, సారిపల్లి సోము నాయుడు, కూండ్రపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పెందుర్తి: ఆర్థిక సమస్యలతో పాటు మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణరాయపురానికి చెందిన బమ్మిడి గౌరీష్(41) కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అదే క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గౌరీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని తల్లి నూకాలమ్మ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ బి.అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రోడ్ల పరిస్థితిపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా కూటమి నేతలు చేసింది శూన్యం. సంక్రాంతికి గుంతల్లేని రోడ్లని దాబుసరి హామీలిచ్చారు. సంక్రాంతి గడిచి ఆరు మాసాలవుతోంది. సబ్బవరం మండలంలోని పలు రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారయింది. కొన్ని చోట్ల చేపట్టిన నాసికరం ప్యాచ్ వర్క్‌లు రోజుల వ్యవధిలోనే కొట్టుకుపోయి, పూర్వస్థితికి చేరాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్లకు, చెరువులకు తేడా లేకుండా పోయింది. అద్దంలా రోడ్లను తీర్చిదిద్దుతామన్న కూటమి హామీ అమలు కోసం మండల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

– సబ్బవరం



వర్సిటీలకు వెళ్లే రోడ్డులో వంగలి వద్ద భారీ గుంతలు

ఈసురోమని రోడ్లు ఉంటే..

- అధ్వానంగా మండలంలోని ప్రధాన రోడ్లు
- ఇటీవలి వర్షాలకు చెరువులను తలపిస్తున్న వైనం
- గుంతల రోడ్లపై రాకపోకలకు ప్రయాణికుల ఇక్కట్లు
- ఏడాది దాటినా అమలుకాని కూటమి ప్రభుత్వ హామీలు

ప్యాచ్ వర్క్‌లు తూచ్!

సంక్రాంతికి గుంతల్లేని రోడ్ల పేరిట మండల పరిధిలో 22.23 కి.మీ. మేర రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ.1.43 కోట్ల నిధులు కేటాయించారు. అయితే ఈ నిధులతో కేవలం అరకొరగా ప్యాచ్ వర్క్‌లు మాత్రమే చేపట్టారు. గతేడాది డిసెంబర్లో కురిసిన అకాల వర్షాలకు ఈ ప్యాచ్ వర్క్‌లకు కూడా ప్యాచ్‌లు పడ్డాయి. మిగిలిన చాలా రోడ్ల పునరుద్ధరణ ప్రతిపాదనలకే పరిమితం కావడంతో రోడ్ల పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోంది.

అడుగడుగునా గుంతలు

సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డులో అంతకాపల్లి, రావలమ్మపాలెం వెళ్లే రోడ్డు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు పొడవునా అడుగడుగునా గుంతలు పడి, వర్షపు నీటితో చిన్న చిన్న మడుగుల్ని తలపిస్తున్నాయి. ఈ గుంతల్లో పడి ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో బీటీ రోడ్డుపై పలు చోట్ల ఏర్పడిన గుంతల్ని గ్రామస్తులు గ్రావెల్‌తో పూడ్చి, మరమ్మతులు చేపట్టారు. అయినా ఇటీవలి వర్షాలకు రోడ్డు పూర్వపు దుస్థితికి చేరుకున్నాయి.



అసకపల్లి సమీపంలో భారీ గుంతల మీదుగా వాహనాల రాకపోకలు

ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక లంకెలపాలెం–అసకపల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు ఎన్టీపీసీ సీఎస్సార్ నిధుల నుంచి రూ.70 లక్షలు రాబట్టారు. ఆ నిధులో రోడ్డులో గోతుల్ని పూడ్చి, పలు చోట్ల తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆరుమాసాల్లోపే ఈ రోడ్డు గతం కంటే మరింత అధ్వానంగా మారింది. పూర్తి స్థాయి నిధులు వెచ్చించి, రోడ్డును పునరుద్ధరించాలని మండల వాసులు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన లంకెలపాలెం-అసకపల్లి రోడ్డు

నడిచేందుకూ వీల్లేదే..

అసకపల్లి–లంకెలపాలెం రోడ్డు భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. నిత్యం హెవీ వెహికల్స్ రద్దీ ఉండటంతో సాధారణ వాహనదారులు రాకపోకలకు భయపడే పరిస్థితి. దీనికి తోడు రోడ్డు చాలా చోట్ల ఛిద్రమైంది. భారీ గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షం కురిసినా.. గుంతల్లో నీరు చేరి, లోతు అంచనా వేయలేక వాహనాలు గోతుల్లోపడి నిలిచిపోతున్నాయి. ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డులో నడిచి వెళ్లేందుకూ సాహసించలేని దుస్థితి.



వర్షపు నీటితో దారుణంగా ఉన్న రాయపుర అగ్రహారం ప్రధాన రోడ్డు

అధ్వానంగా వర్సిటీలకు వెళ్లే రోడ్డు

సబ్బవరం–చోడవరం రోడ్డు నుంచి రాయపుర అగ్రహారం మీదుగా వంగలిలోని మారిటైం, పెట్రో వర్సిటీలకు వెళ్లే రోడ్డు దారుణంగా మారింది. ప్రస్తుతం ఆయా విశ్వవిద్యాలయాల్లో నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మాణ సామగ్రిని తరలించే భారీ వాహనాల రాకపోకలతో రద్దీ పెరిగి, రోడ్డు ఛిద్రమైంది. ప్రస్తుత వర్షాలకు గోతుల్లో నీరు చేరి, ఇరుగ్గా మారింది. తరచూ భారీ వాహనాలు గోతుల్లో పడి బ్రేక్ డౌన్ అవుతున్నాయి.

రాకపోకలకు ఇబ్బంది



ఆరిపాక–వంగలి రోడ్డు అధ్వానంగా మారింది. ప్రస్తుతం వర్సిటీలకు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో భారీ గోతులతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. భారీ వాహనాలు రాకపోకలతోపాటు, వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డును ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి అభివృద్ధి చేయాలి.

– పిల్లల మునలయ్య, రాయపుర అగ్రహారం

అత్యంత దయనీయం



లంకెలపాలెం–అసకపల్లి రోడ్డు మండలంలోనే కాదు జిల్లాలో మరే రోడ్డూ లేనంత దారుణంగా ఉంది. నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహన చోదకులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకోవాలి. ఇటీవల చేపట్టిన మరమ్మతులు రోజుల్లోనే కొట్టుకుపోయాయి.

– పెచ్చేటి రమేష్‌నాయుడు, పైడివాడ అగ్రహారం

అధినేతతో ఆత్మీయ భేటీ



మాజీ సీఎం జగన్‌తో పరవాడ మండల యువజన విభాగం అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్

పరవాడ: వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్ తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో పార్టీ పురోభివృద్ధికి చేస్తున్న కృషిని ఆయనకు వివరించి, తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

విత్తన శుద్ధితో వరిలో తెగుళ్ల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పరవాడ: వరి సాగులో విత్తన శుద్ధిద్వారా తెగుళ్ల నివారణ సాధ్యమని పరవాడ వ్యవసాయ శాఖ అధికారి ఎం.రమాదేవి సూచించారు. రావాడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పోలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని, రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. వరి నారుకు ఉపయోగించే కిలో వరి విత్తనాలకు 8–10 గ్రాముల చొప్పున సుడోమోనాస్‌ను పట్టించి నీడలో ఆరబెట్టి విత్తడం ద్వారా తెగుళ్లను అరికట్టవచ్చని చెప్పారు. అనంతరం వాడచీపురుపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్ష నమూనా సేకరించు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాడచీపురుపల్లి సర్పంచు శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, ఏఈవో మాసవరపు మూర్తి, వీహెచ్‌ఏ జాస్మిన్, వీపీఏ గౌతమ్ పాల్గొన్నారు.

వంగలి గ్రామాభివృద్ధికి 'పెట్రో వర్సిటీ' చొరవ



పాఠశాలకు అందించిన కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న శాలివాహన, తదితరులు

సబ్బవరం: స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా విద్య, వైద్యంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ డైరెక్టర్ శాలివాహన అన్నారు. మండలంలోని వంగలిలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా వర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. వంగలి గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 1 నుంచి 15 వరకు ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు, బాలికా విద్య ప్రోత్సాహానికి పెద్దపీట వేయనున్నట్లు వెల్లడించారు. పాఠశాలకు ఓ కంప్యూటర్, క్రీడా సామగ్రిని అందించారు. గ్రామంలో పారిశుధ్య కార్మికులను సత్కరించి, ప్రోత్సాహక బహుమతులు అందించారు. పాఠశాల ఆవరణంలో డైరెక్టర్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా గ్రామంలోని రామాలయం వద్ద కేర్ హాస్పిటల్, వాసన్ ఐ కేర్ సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో పెట్రో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీరాంపాల్ త్రివేది, జాయింట్ రిజిస్ట్రార్, కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మురళీకృష్ణ, ఎంఈవో రవీంద్రబాబు, హెచ్‌ఎం మాధవి, గ్రామ పెద్దలు ఆకుల గణేష్, గవర రాజు, జెట్టి హేమంత్, యర్ర సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి అభివృద్ధికి సహకరించండి



జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: నియోజకవర్గంలోని జీవీఎంసీ పరిధిలో అభివృద్ధికి సహకారం అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. బుధవారం నగరంలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, వాటికి తగిన నిధులు మంజూరు చేయాలని అడిగారు. నియోజకవర్గంలోని పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు అందిస్తున్న గండి బాబ్జి, తదితరులు



విత్తనాలు అందిస్తున్న చంద్రావతి, రెడ్డి నారాయణరావు

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో ఖరీఫ్ సీజన్‌కు రాయితీపై వరి విత్తనాల పంపిణీని బుధవారం చేపట్టారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు విత్తనాలందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తమరాన బంగారినాయుడు, సత్యనారాయణ, అంగటి నానాజీ, మేడపాటి రాము, గండి నరేష్ శ్రీరాములు, దేముళ్లు పాల్గొన్నారు.

పెందుర్తి: రాంపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు వరి విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి చంద్రావతి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు హిమబిందు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమానికి తొలి ప్రాధాన్యత'



'సుపరిపాలనలో తొలి అడుగు'లో గండి బాబ్జి

పరవాడ: రాష్ట్ర ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జి అన్నారు. పరవాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికి సంక్షేమంతో పాటు అభివృద్ధి ఫలాలను అందించేందుకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కోరాడ శంకరరావు, నాయకులు గండి వంశీ, పైల సన్యాసిరావు, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న తదితరులు పాల్గొన్నారు.


విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషి



విద్యా ప్రమాణాలపై హెచ్‌ఎంను ఆరా తీస్తున్న డీఈవో గిడ్డి అప్పారావునాయుడు

సబ్బవరం: మండలంలోని గొటివాడ ప్రాథమిక పాఠశాలను అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు బుధవారం సందర్శించారు. విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల సమస్యలు, మౌలిక వసతుల కల్పన వంటివాటిపై విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరిచేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రార్థనా సమయానికి వచ్చిన ఆయన, విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. స్కూల్ హెచ్‌ఎం పీవీ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

పెరియాళ్వార్ తిరునక్షత్రం పూజలు



దివ్య ప్రబంధ పారాయణ చేస్తున్న వైదికులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం పెరియాళ్వార్ తిరునక్షత్రం పూజలు విశేషంగా జరిగాయి. ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను, పెరియాళ్వార్‌ను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు నాళాయిర దివ్య ప్రబంధ పారాయణ చేశారు. విశేష హారతులు అందించారు.

కల్తీ మద్యం తయారీదారులపై ఎక్సైజ్ దాడులు

పరవాడ: పరవాడ కేంద్రంగా కల్తీ మద్యం తయారు చేస్తున్నారన్న అనుమానంతో నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పరవాడలో వివిధ చోట్ల నాలుగిళ్లలో ఈ కల్తీ మద్యం తయారు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు బుధవారం సాయంత్రం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్, సబ్బవరం ఎక్సైజ్ అధికారులు ఆ ఇళ్లపై దాడులు చేపట్టారు. కల్తీ మద్యం తయారీకి ఉపయోగిస్తున్న స్పిరిట్, సీసాలు, కప్పులు, సీళ్లు, మరికొంత సామగ్రిని స్వాధీనం చేసుకున్నారని సమాచారం. కల్తీ మద్యం తయారు చేసి బెల్ట్ షాపుల ద్వారా అమ్మకాలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ కల్తీ మద్యం తయారీతో సంబంధం ఉన్న పలువురిని అదుపులోకి తీసుకుని పూర్తి వివరాలు రాబట్టేందుకు ఎక్సైజ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. విచారణ పూర్తయిన తరువాత వివరాలు వెల్లడించనున్నట్లు విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఎక్సైజ్ అధికారులు సమాధానం ఇచ్చారు.

'ఎండీఎం కార్మికులకు కనీస వేతనాలివ్వాలి'



డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరవాడ: మధ్యాహ్న భోజన(ఎండీఎం) కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఎండీఎం కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. పరవాడలో కార్మికులతో కలిసి బుధవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆకాశాన్ని అంటిన నిత్యావసర ధరలతో పోలిస్తే ప్రభుత్వం ఇస్తున్న వేతనం ఎందుకూ సరిపోవట్లేదన్నారు. పథకం కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు సరిపోక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ నెల 1వ తేదీకి బిల్లులు చెల్లించి, జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎండీఎం కార్మికులు కె.ఆదిలక్ష్మి, గండి లక్ష్మి, నాగమణి, నూకరత్నం, లక్ష్మి, నూకాలమ్మ, రత్నకుమారి, పార్వతి, రత్నం పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణలో ఎన్జీవోల సేవలు అమూల్యం



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సూచనలిస్తున్న దేవస్థానం అధికారులు, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ

సింహాచలం: ఏటా గిరిప్రదక్షిణలో స్వచ్ఛంద సంస్థ(ఎన్జీవో)లు భక్తులకు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని సింహాచలం దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ కొనియాడారు. ఈ నెల 9న గిరిప్రదక్షిణ, 10న ఆలయ ప్రదక్షిణ పురస్కరించుకుని సేవలందించే ఎన్జీవో ప్రతినిధులతో దేవస్థానం అధికారులు గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు బుధవారం సమావేశమయ్యారు. డిప్యూటీ ఈవో మాట్లాడుతూ 32 కి.మీ. దారిపొడవునా, సింహగిరిపై భక్తులకు ఆహారపదార్థాలు, స్నాక్స్, బిస్కట్లు, పాలు, శీతల పానీయాలు తదితర వాటిని పెద్ద ఎత్తున స్వచ్ఛంద సంస్థలు అందిస్తూ తమ భక్తిభావాన్ని చాటుతున్నాయన్నారు. ఈ ఏడాది కూడా సేవలందించేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. తొలిపావంచా నుంచి పాత అడవివరం జంక్షన్, వేపగుంట నుంచి పాతగోశాల జంక్షన్, గోపాలపట్నం నుంచి పాత గోశాల జంక్షన్, తీవ్ర రద్దీగా ఉంటాయని, ఆ మార్గాల్లో స్టాల్స్ ఏర్పాటు చేయొద్దని సూచించారు. సమావేశంలో ఈఈ రమణ, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, ఏఈ రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తున్న చిన్న

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా మంజూరైన స్కూల్ యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగులను బుధవారం ఆయన రావాడ, శృంగారపాడు ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కోన కృష్ణ, సాలాపు రమణ, కోన చిన రామునాయుడు, డి.సంతోష్, ఎం.వరలక్ష్మి, జయ, వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సత్కారం



బదిలీ టీచర్లకు సన్మానం చేస్తున్న గ్రామస్తులు, సిబ్బంది

పెందుర్తి: మండలంలోని చింతలగ్రహారం జెడ్పీ హైస్కూల్ నుంచి ఇటీవల బదిలీ అయిన 11 మంది ఉపాధ్యాయులను గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం పీవీఎస్ఎస్ నాగమణి ఆధ్వర్యంలో హెచ్‌ఎం పదోన్నతితో బదిలీపై వెళ్లిన ఎల్.అనంతలక్ష్మి, సాధారణ బదిలీల్లో వివిధ స్కూళ్లకు వెళ్లిన ఉపాధ్యాయులు జె.శాంతి, బి.గిరివరప్రసాద్, కె.మాధవి, పి.శ్రీనివాసరావు, ఎస్.ఎస్.నాగమణి, ఎ.లక్ష్మి, డి.హేమలత, జి.అవతారం, బి.వేలంగిణిలతో పాటు, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఆర్.పద్మలను దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు పి.వెంకటరమణ, ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొడ్డేటి నూకరాజు, మాజీ చైర్మన్ మద్దాల శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.